
సాక్షి
నంద్యాల
ఆదివారం । 9 । జూలై । 2023



కేసీకి నీరు విడుదల

గూడూరు: తాగు నీటి కోసం సుంకేసుల జలాశయం నుంచి 189 క్యూసెక్కుల నీటిని శనివారం కేసీకి విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



దోమకు ముకుతాడు!

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. డెంగీ వ్యాధి కట్టడికి అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేశారు. పరిశుభ్రతపై దృష్టి సారించారు. 8లో▸



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం మేడ్చర్లకు చెందిన విశ్వకర్మ ప్రసన్న రూ.1,01,000 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



ఆలయ ప్రాంగణంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట రమణ దంపతులు

శ్రీశైలం టెంపుల్: భ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ దుప్పల వెంకట రమణ దంపతులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆహ్వానం పలికారు. అనంతరం వారు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

మద్దిలేటి స్వామి ఒక్క రోజు ఆదాయం రూ.6.56 లక్షలు



రూ. లక్ష విరాళం అందజేస్తున్న నంద్యాలకు చెందిన సాయమ్మ

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి ఆలయానికి ఆషాడ మాసం శనివారం సందర్భంగా ఒక్క రోజు ఆదాయం రూ.6.56 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. వేకువజాము నుంచే ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ, నిర్వహించారు. నంద్యాల పట్టణం హరిజనవాడకు చెందిన ఉదయ్ కుమార్, మధు జ్ఞాపకార్థం సాయమ్మ ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

గురుకులాల్లో 5వ తరగతి సీట్లు ఖాళీ

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో మిగిలి ఉన్న సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయుటకు నిర్ణయించినట్లు జిల్లా గురుకులాల సమన్వయ కర్త రామసుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12 తేదీల్లో దిన్నెదేవరపాడు బాలికల పాఠశాల, కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏపీజీపీ సెట్ ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల సంస్థ నుంచి మెసేజ్ వచ్చిన వాళ్ల మాత్రమే కౌన్సెలింగ్‌కు రావాలన్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ప్రవేశ పరీక్ష మెరిట్‌కార్డు తప్పని సరిగా తీసుకు రావాలన్నారు.

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు

ఎమ్మిగనూరు టౌన్: శ్రీహరి కోటలో ఈనెల 14న ఇస్రో ప్రయోగించనున్న చంద్రాయన్-3 లాంచింగ్ వీక్షణకు ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి విద్యార్థులు, ప్రజల కోసం అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ శనివారం తెలిపారు. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. ఆసక్తి గలవారు అడ్వాన్స్ కట్టి బుక్ చేసుకోవచ్చాన్నారు. అదేవిధంగా ఈనెల 31న అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు రూ,2200ల ప్రకారం టికెట్ ప్రతిపాదికన బస్సు నడపనున్నామని తెలిపారు.

మది నిండా రాజన్న

- ఊరూరా వేడుకలా వైఎస్సార్ జయంతి
- మహానేత విగ్రహాలకు క్షీరాభిషేకాలు
- కేక్‌లు కట్ చేసి సందడి చేసిన అభిమానులు
- వైఎస్సార్ పాలనను కొనియాడిన ప్రజా ప్రతినిధులు

ప్రగతి ప్రదాతను పల్లె జనం మనస్సారా స్మరించుకున్నారు. జలయజ్ఞంతో వ్యవసాయాన్ని పండుగ చేసిన అపరభగీరథుడికి అన్నదాతలు క్షీరాభిషేకం చేశారు. ఆరోగ్య శ్రీతో ప్రాణాలు నిలిపిన మహర్షికి పేదలు కేక్‌లు కట్ చేసి అభిమానాన్ని చాటారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం జిల్లాలో పండుగలా నిర్వహించారు. ఊరూరా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు రాజన్న పాలనను కొనియాడారు.



ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కట్‌చేసి పంచిపెడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



నంద్యాలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

నంద్యాల: రైతుబాంధవుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని జిల్లాలో వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఆయన సంక్షేమ పాలనను స్మరించుకున్నారు. నంద్యాల పట్టణం శ్రీనివాస సెంటర్, సాయిబాబానగర్, చామకాల్వ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆరోగ్యశ్రీ నుంచి 108 వరకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నుంచి రుణ మాఫీ వరకు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలతో పేదలు లబ్ధి పొందేలా చేశారన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్ తన పాదయాత్రలో వైద్యం అందక ఆగిపోతున్న పేద గుండెలను



వైఎస్సార్ స్మృతివనంలో..

చూసి ఆరోగ్యశ్రీని అమలు చేశారన్నారు. ఈ పథకం ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువగా ఏపీ, తెలంగాణలో నిర్విరామంగా కొనసాగుతుందని, కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, ఆర్‌జీఎం విద్యాసంస్థల అధినేత మిద్దె శివరాం, వైఎస్సార్‌సీపీ డాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లె రాకేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో..

శ్రీశైలం నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నంద్యాల టర్నింగ్ రోడ్డు మీదుగా వైఎస్సార్ స్మృతి వనం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ స్మృతి వనంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరులో..

నందికొట్కూరు పట్టణంలో ఎమ్మెల్యే ఆర్థర్ స్వగృహంలో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు. అనంతరం కర్నూలు రోడ్డు, కోటవీధి, పాత బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే ఆర్థర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్థర్ మాట్లాడుతూ వైఎస్సార్ అనంతరం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌సుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మహానేత విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

బనగానపల్లెలో..

నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించి, కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా అసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన తనయుడు కాటసాని ఓబులరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ఉచిత విద్యుత్ ఫైల్‌పై వైఎస్సార్ మొదటి సంతకం చేసి రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. బనగానపల్లెలో పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల భవనాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు.

పాణ్యంలో..

నియోజకవర్గ కేంద్రం పాణ్యం సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ వైఎస్సార్ చేపట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందుతున్న పేద ప్రజలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని దేవుడిలా కొలుస్తున్నారన్నారు.

ఆళ్లగడ్డలో..

ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డేనన్నారు. కార్యక్రమంలో విజయ పాల డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో..

నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మహానేత జయంతిని పండుగలా నిర్వహించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖరరెడ్డి తదితరులు కేక్ కట్ చేశారు. వైఎస్ఆర్ సర్కిల్‌లో మహానేత విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బనగానపల్లెలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



పాణ్యం అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవంలో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కర్నూలులో మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య



ఆత్మకూరు పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ముగిసిన జయతీర్థుల ఆరాధన వేడుకలు

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి జయతీర్థుల ఉత్తరారాధన వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం కర్ణాటక లోని అనెగొందినవ బృందావన క్షేత్రంలో శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల చేతుల మీదుగా ఈ వేడుకలు నిర్వహించారు. అణెగొంది క్షేత్రంలో ముందుగా జయతీర్థుల బృందావనానికి పీఠాధిపతి విశేష పంచామృతాభిషేకం పుష్పలంకరణలు గావించి మంగళహారతులతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అణెగొందిలోని జయ, దిగ్విజయ, మూలరాముల సంస్థాన పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గురు సార్వభౌమ సాహిత్య మండలి వారు చేపట్టిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం జయతీర్థుల విశిష్టతను పీఠాధిపతి భక్తులకు వివరించారు.



జయతీర్థుల బృందావనానికి హారతులిస్తున్న పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థులు

సర్కారు వారి టమాట

- రాయితీపై రూ. 50కు కిలో
- నంద్యాలలో మొదటిరోజు 2 టన్నుల పంపిణీ
- ఊరట చెందుతున్న వినియోగదారులు

నంద్యాల(సెంట్రల్): చేతిలో నుంచి జారిపడిన కూరగాయల సంచి.. చితికిన ఐదు టమాటలు.. భారీగా ఆస్తి నష్టం. కిలో టమాట ధర కంటే కిలో టమాట కెచప్ తక్కువ.. ఆపిల్, టమాట ఒకే ధర.. ఇలాంటివి ఎన్నో ఇటీవల సోషల్ మీడియాలో టమాటపై మీమ్స్ జోరందుకున్నాయి. ఇందుకు కొన్ని రోజులుగా టమాట ధరలు వినియోగదారులను భయపెడుతుండటమే కారణం. కిలో ధర రూ.140కి పైగా ఉండటంతో అత్యవసరమైనా సరే సామాన్యులు కూరల్లో అత్తెసరుగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా రూ.50కే కిలో టమాట పంపిణీ చేయాలని నిర్ణయించి పంపిణీ చేపట్టింది. శనివారం పట్టణంలోని శ్రీనివాసనగర్ రైతుబజార్, టెక్కె మార్కెట్ యార్డులోని రైతు బజారులో జిల్లా అగ్రిట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రెహమాన్ సబ్సిడీపై టమాట పంపిణీ ప్రారంభించారు. మొదటి రోజు 2 టన్నులు పంపిణీ చేశారు. మార్కెట్లో కిలో టమాటా రూ.140 ధర ఉండటంతో, రాయితీ పోనూ రూ.90 ప్రకారం 2 టన్నుకు రూ.1.80 లక్షలు వినియోగదారులకు ఆదా అయినట్లే. పంపిణీ ప్రారంభించిన కొద్దిసేపటికే వినియోగదారుల తాకిడి భారీగా పెరిగింది. ఆధార్ కార్డు నంబరు నమోదు చేసుకుని ఇస్తుండటంతో ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతోంది. ధరలు తగ్గే వరకూ రైతు బజార్లలో టమాట కౌంటర్లు కొనసాగిస్తామని రెహమాన్ తెలిపారు.



శ్రీనివాసనగర్ రైతు బజార్‌లో టమాటలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సీఎం జగన్ రైతుల పక్షపాతి

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో శనివారం జిల్లా స్థాయి రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్, ఇసాక్ బాషా, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, పట్టు పరిశ్రమ అధికారి పరమేశ్వరి తదితరులు హాజరయ్యారు. ముందుగా వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డాక్టర్ వైఎస్ఆర్ పంటల బీమా పథకం కింద మంజూరైన పరిహారాన్ని బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా పరిహారం అందజేసి ఆదుకున్నారన్నారు. జిల్లాలో 2022 ఖరీఫ్‌లో పంట నష్టపోయిన 49,637 మంది రైతులకు రూ.46.67 కోట్ల బీమా పరిహారం ముఖ్యమంత్రి జమ చేశారన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5,238 మంది రైతులకు రూ.10.24 కోట్లు, బనగానపల్లెలో 1,548 మంది రైతులకు రూ.3.65 కోట్లు, డోన్‌లో 21,889 మంది రైతులకు రూ.15.08 కోట్లు, నందికొట్కూరులో 14,479 మంది రైతులకు రూ.10.37 కోట్లు, నంద్యాలలో 1,510 మంది రైతులకు రూ.1.99 కోట్లు, పాణ్యంలో 3,232 మంది రైతులకు రూ.4.28 కోట్లు, శ్రీశైలంలో 1,741 మంది రైతులకు రూ.1.04 కోట్లు పరిహారం అందిందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పెట్టుబడి పెట్టేందుకు బీమా పరిహారం మొత్తం అందజేయడం ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడంతో పంటల బీమా, ఈ క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు రైతులకు వైఎస్సార్ బీమా పరిహార మెగా చెక్కును అందజేశారు.



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌లు

క్లుప్తంగా

మైనార్టీ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు సిటీ: కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్ సమీపం ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల మైనార్టీ జూనియర్ కాలేజీ(బాలురు)లో ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రాయలసీమ రీజినల్ కన్వీనర్ డాక్టర్ జయం శ్రీనివాస గుప్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూప్‌లలో అడ్మిషన్స్ జరుగుతున్నాయని, ఇప్పటి వరకు ఎంపీసీలో 19, బైపీసీలో 20, సీఈసీలో 4 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. ఇంకా ఎంపీసీలో 13, బైపీసీలో 12, సీఈసీలో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ముస్లిం మైనార్టీ విద్యార్థులు రెండో దశలో నేరుగా కాలేజీలో సంప్రదించి సీట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ఓర్వకల్లు: మామిడి తోటలను కౌలుకు తీసుకొని వ్యాపారం చేస్తున్న ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉయ్యాలవాడ గ్రామంలో శనివారం చోటుచేసుకోంది. గ్రామానికి చెందిన మిద్దె వెంకటకృష్ణ (31) గ్రామంలో కొందరి మామిడి తోటలను కౌలుకు తీసుకొని వ్యాపారం చేసేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది మామిడి దిగుబడులు పూర్తిగా క్షీణించడంతో పెట్టుబడి నిమిత్తం సుమారు రూ.6 లక్షలను ఇతరుల వద్ద అప్పులు చేశాడు. ఒకవైపు అప్పులను తీర్చలేక, మరోవైపు ఆరోగ్య పరిస్థితులు సహకరించక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని భార్యతో పాటు, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుని భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.

యువతి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: పట్టణంలోని గీతా వీధికి చెందిన రెహన(19) అనే యువతి శనివారం ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో సరిగ్గా పనిచేయలేదని తల్లిదండ్రులు మందలించినందుకు క్షణికావేశానికి లోనై పురుగుల మందు తాగింది. ఈ మేరకు తండ్రి వలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి చెప్పారు.

దోమకు ముకుతాడు !

- జిల్లాలో విస్తృతంగా దోమల నియంత్రణ కార్యక్రమాలు
- ఈ ఏడాది జిల్లాలో 271 మందికి డెంగీ వ్యాధి నిర్ధారణ
- ప్రభుత్వ చర్యలతో తగ్గుతున్న దోమలు
- జూలై డెంగీ వ్యాధి నివారణ మాసోత్సవం

సీజన్ మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా డెంగీ వ్యాధి కట్టడికి అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేశారు. ఏ చిన్న లక్షణం కనిపించినా ఆసుపత్రుల్లో డెంగీ పరీక్ష చేస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో ఆదోని, ఎమ్మిగనూరులలో ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 26 అర్బన్‌హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటితో పాటు 700లకు పైగా నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాయి. సీజన్ మార్పు రావడంతో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలకు సూచిస్తున్నారు. డెంగీ వ్యాధి ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల మొత్తాన్ని అవగాహన కల్పించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. వ్యాధిలక్షణాలతో ఆసుపత్రికి రాగానే వైద్యులు ముందుగా ర్యాపిడ్ పరీక్ష చేయిస్తున్నారు. అందులో డెంగీగా నిర్ధారణ అయితే వెంటనే రక్తకణాల పరీక్షలు చేస్తున్నారు. కణాల సంఖ్య తక్కువగా ఉంటే వెంటనే రక్తం, ప్లేట్‌లెట్లు తెచ్చుకోవాలని చెబుతున్నారు.

జిల్లాలో 271 మందికి డెంగీ లక్షణాలు

జిల్లాలో డెంగీ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గత జనవరి మాసం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 271 మందికి వ్యాధి ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. మరో 2,319 మందికి వ్యాధి లక్షణాలున్నా అనుమానిత కేసులుగా భావించి చర్యలు తీసుకున్నారు. మరోవైపు డెంగీ లక్షణాలు కనిపిస్తే వైద్యులు ర్యాపిడ్ పరీక్ష చేయిస్తున్నారు. అందులో వ్యాధి నిర్ధారణ అయితే ఎలీసా టెస్ట్‌కోసం పంపిస్తున్నారు. ఇందులోనూ పాజిటివ్ వస్తే వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన చర్యలను తీసుకుంటున్నారు. ప్రతి పీహెచ్‌సీలో ఉన్న సచివాలయం పరిధిలో ప్రతి ఏఎన్‌ఎం, ఆశా, వలంటీర్స్, సూపర్‌వైజర్స్‌తో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

డెంగీ ఎలా సోకుతుందంటే...!

ఏడిస్ ఈజిప్టై అనే దోమకాటు వల్ల డెంగీ సోకుతుంది. ఈ దోమ ఒంటిపై నల్లటి, తెల్లటి చారలు ఉంటాయి. అందుకే దీనిని పులిదోమ అని కూడా అంటారు. ఇది శుభ్రమైన, నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. సూర్యోదయమైన రెండు గంటల వరకు, సూర్యోదయానికి రెండు గంటల ముందు మాత్రమే ఇది కుడుతుంది. ఇది కేవలం రెండు వారాలు మాత్రమే జీవిస్తుంది. ఇది తన జీవిత కాలంలో మూడుసార్లు మాత్రమే గుడ్లు పెడుతుంది. ప్రతిసారి వంద గుడ్లు పెడుతుంది. ఈ దోమలు ఇంట్లో బట్టలు, పరుపులు, కర్టన్స్ వెనుక దాక్కుంటాయి.



దోమల నివారణ చర్యలు తీసుకుంటున్న మలేరియా విభాగం సిబ్బంది

డెంగీ వ్యాధి లక్షణాలు

తీవ్రమైన తలనొప్పి,కళ్లు, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. ఒంటిపై ఎర్రటి దురదలు కనిపిస్తాయి. ముక్కు, చిగుళ్లల్లో రక్తం స్రవిస్తుంది.

ఈ దశలో ఆసుపత్రిలో చేర్చాలి

- తీవ్రమైన కడుపునొప్పి, రక్తవాంతులు అవుతుంటే, శరీరంపై ఎర్రటి దద్దుర్లు రావడం, ముక్కు, చిగుళ్లల్లో రక్తం స్రవించడం, మలమూత్రాల్లో రక్తం పడటం, మత్తుగా ఉండటం, ఊపిరితీసుకోవడం కష్టంగా ఉన్న పరిస్థితుల్లో తప్పనిసరిగా ఆసుపత్రిలో చేర్చాలి.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



జూలై మాసంలో డెంగీపై అవగాహన కల్పించేందుకు గాను జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. నీటి నిల్వలు ఉన్న చోట సంబంధిత పంచాయతీ/వార్డు శానిటరి సెక్రటరీలకు చెప్పి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించాము. ప్రతి శుక్రవారం ఇంటింటికి తిరిగి ఇండ్లలో ఉన్న నీటినిల్వలను లేకుండా చర్యలు తీసుకుంటున్నాము. డెంగీ వ్యాధి నిర్ధారణ అయిన ఇంటికి చుట్టుపక్కల 50 ఇళ్లలో నీటిని తనిఖీ చేసి లార్వాలు ఉన్న చోట వాటిని నాశనం చేయడం, ఇళ్లలో పైరిత్రమ్ స్ప్రే చేయడం, వీధుల్లో దోమల సంహారం కోసం ఫాగింగ్ చేయించడం చేస్తున్నాం.

– నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

11న విభిన్న ప్రతిభావంతులకు జాబ్ మేళా

కర్నూలు(అర్బన్): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 11న ఉదయం 10 గంటలకు స్థానిక సి.క్యాంప్ సెంటర్‌లోని తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి పి.దీప్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఓ, ఈ - కామర్స్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీల్లో వాయిస్ అండ్ నాన్ వాయిస్ ప్రాసెస్, డాటా ఎంట్రీ, ప్యాకింగ్, సీఎస్‌ఏ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. వాయిస్, నాన్ వాయిస్ పోస్టుకు ఆర్థో, డెఫ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, మిగిలిన పోస్టులకు డెఫ్ అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ వివరాలను www.ncs.gov.inలో రిజిష్టర్ చేసుకోవాలన్నారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ వెంకటరాముడు

ఆత్మకూరు: తెలంగాణ రాష్ట్రం నుంచి మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు సిబ్బందిని ఆదేశించారు. ఆత్మకూరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలో నాటుసారా తయారీ, మద్యం అక్రమ రవాణాపై నిఘా పెంచాలన్నారు. ఆయన వెంట ఆత్మకూరు సబ్ ఇన్‌స్పెక్టర్ నాయుడు ఉన్నారు.

రగ్బీలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సురేందర్

కర్నూలు(రూరల్): విద్యార్థులు రగ్బీ క్రీడల్లో రాణించాలని ఉన్నత విద్య అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి సూచించాపారు. శనివారం నగరంలోని బి.క్యాంప్ క్రీడామైదానంలో డిగ్రీ కళాశాలల రగ్బీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ వైవిధ్యభరితమైన రగ్బీ క్రీడను ప్రతి ఒక్కరూ సాధన చేయాలన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో తలపడిన ఎస్టీబీసీ కళాశాల జట్టు ఉస్మానియా కళాశాలపై గెలుపొందింది. కార్యక్రమంలో రగ్బీ సంఘం అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శి రామాంజనేయులు, నాగరత్నమయ్య, చిట్టిబాబు, ప్రతాప్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల పీజీటీ బాలికలు (క్రీడా పాఠశాల)లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మేరీ సలోమి శనివారం తెలిపారు. 6వ తరగతిలో నూతన ప్రవేశాలు, 7,8,9తరగతుల్లో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. కర్నూలు, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలల్లోని గిరిజన గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలు, ప్రభుత్వ పాఠశాల ఎస్టీ విద్యార్థులను క్రీడల ద్వారా ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబధించి ఈనెల 19వ తేదీన క్రీడలు ప్రారంభమవుతున్నట్లు చెప్పారు. క్రీడల్లో పాల్గొనదలిచిన వారు ఆయా పాఠశాల హెచ్‌ఎంలచే ధ్రువీకరణ పత్రంతో రావాలన్నారు. 6వ తరగతిలో 30 సీట్లు, 7వ తరగతిలో 30, 8వ తరగతిలో 24, 9వ తరగతిలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె వివరించారు.

బోధనాసుపత్రిలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ పర్యటన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పలు భవనాలను ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. కళాశాల మైదానంలో ఎన్ఆర్ఐలు నిర్మించాలనుకుంటున్న భవన స్థలం వివరాలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ వివరించారు. అనంతరం నాడు-నేడు కింద కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రి పనులను ఎస్ఈ, ఈఈ, ఏఈల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. అక్కడ ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి పనుల పురోగతిని, అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు.



పనుల పురోగతిని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డికి వివరిస్తున్న అధికారులు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతిచెందిన శ్రీనివాస్

కర్నూలు: కల్లూరు మండలం ముజఫర్ నగర్‌లో నివాసముంటున్న డేరంగుల శ్రీనివాస్ అలియాస్ తేజ (19) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. 7వ తరగతి వరకు చదువుకున్న ఇతను ప్రస్తుతం పెయింటర్‌గా పనిచేస్తూ తల్లి సోమేశ్వరికి చేదోడుగా ఉండేవాడు. కొంతకాలంగా చెడు వ్యసనాలకు బానిసై అల్లరిచిల్లరగా తిరుగుతుండేవాడు. కల్లు, వైట్నర్‌ను సేవిస్తూ ఎక్కడ పడితే అక్కడ పడిపోయేవాడు. శుక్రవారం తెల్లవారుజామున ఇందిరాగాంధీ నగర్‌లోని రెండు కుళాయిల వద్ద రైల్వే ట్రాక్ పక్కన కల్లు తాగి మత్తులో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో తల్లి సోమేశ్వరి సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి తీసుకువెళ్లింది. అయితే చెవిలో రక్తం, వీపు భాగంలో గోకుడు గాయం ఉండటమే కాక కడుపునొప్పిగా ఉందని చెప్పడంతో రాత్రి 9 గంటల సమయంలో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడు ఎలా చనిపోయాడు అనే విషయాన్ని ధ్రువీకరించి న్యాయం చేయాల్సిందిగా నాలుగో పట్టణ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

మహానందీశ్వరుడి సేవలో..



కమిషనర్ బాలకృష్ణ దంపతులకు వేదాశీర్వచనం ఇస్తున్న పండితులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో ఉభయ తెలుగురాష్ట్రాల ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ బాలకృష్ణ పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారికి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి వారికి స్వామివారి ప్రసాదాలు అందించగా వేదపండితులు రవిశంకర అవధాని వేదాశీర్వచనం చేశారు.

పాత పెన్షన్ అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగింది. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎం.రామనరసింహ మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్‌ను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. సీపీఎస్‌కు జీపీఎస్‌కు పెద్ద తేడా లేదన్నారు. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలన్నారు. దీని కోసం రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ గట్టు తిమ్మప్ప, నాయకులు సుధాకర్, జనార్దన్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.